# శాంతితో బాటు సౌఖ్యం

"ఆ ! ఇంక పడుకో, బార్బరా! ఏమిటీ? జోసెఫా ? జోసెఫుకు ఏమీ కాలేదులే. అతన్ని చంపలేదులే! బావిలో వేశారూ; అయితే బావిలో నీళ్ళు లేవు, అంచేత మళ్ళీ పైకి లాగేశారు! రేపు చెబుతాను మిగతా కథ. సరేనా ?"

"ఊఁ! ఇంకో ముద్దియ్యి బీవర్!" అంటూ రెండు చిన్ని చేతులు బివర్లే మెడచుట్టూ పెనవేసుకున్నాయి. బివర్లే ముఖంమీద తల్లికి వలే ఆ చిన్నబిడ్డ ముద్దులు కురిపించేసింది.

"ఇంక పడుకోండి. మనస్సులో ప్రార్థనలు చేసుకుని మరీ పడుకోండేం!" అంటూ బివర్లే పక్కమీద ఉన్న ఇద్దరు తల్లిలేని పిల్లల మీదా బ్లాంకెట్ పరిచి పక్కను సవరిస్తున్నది. ఇంతలో చడీచప్పుడూ చేయకుండా గది వాకిట నుంచుని చూస్తున్నాడా తల్లిలేని బిడ్డల తండ్రి రెవరెండు జాన్ హోవార్డు. అతన్ని చూడలేదు బివర్లే. "గుడ్‌నైట్ డార్లింగ్!

గుడ్‌నైట్ డార్లింగ్!" అని ఆమె వెనక్కు తిరిగేవరకు జాన్ వెళ్ళిపోయాడు.

బివర్లే ఆరంస్ట్రాంగ్ మెల్లిగా ఒక శాలువ మీద వేసుకుని బీచి వొడ్డుకు బయల్దేరింది. ట్రిప్లికేన్‌లో వారి ఇంటికీ బీచికీ మూడు ఫర్లాంగులే. దారిలోనే జాన్ వికార్‌గా రున్న చర్చిగూడా వుంది. చర్చినే చూసుకుంటూ బీచికి పోయింది బివర్లే.

రాత్రి తొమ్మిదైనది. వెన్నెల పెళపెళలాడుతుంటే సముద్రం విలవిలలాడుతుంటే బివర్లే ముఖం కళకళలాడింది. కాని, కళలోగూడ కించ యేదో కనబడుతూనే వున్నది.

బివర్లేకు ముప్పై రెండేండ్లు. చూడడానికి పాతికేండ్ల వయస్సుగలదిగా కనబడుతుంది. తల్లి ఆంగ్లో ఇండియనేగాని తండ్రి నార్వీజియను. ఆవిడ అందచందాలలో ఆ వ్యత్యాసం తెలుస్తూనే వున్నది.

ఏదో చప్పుడు విని ఉలికే బెదిరింది బివర్లే. ఇటీవల అట్లా అనేక సార్లు అకారణంగా జడుసుకుంటున్నది. ఎందుకులే అని మళ్ళీ వెనక్కు తిరిగింది.

ఇంటి వాకిట ఆమెకై ఎదురు చూస్తున్నాడు జాన్.

జాన్‌కు నలభై యేండ్లుంటాయి. మంచి ఆరోగ్యవంతుడు. నెమ్మదియైనవాడు. జాలిగలవాడు.

బివర్లే ఆరంస్ట్రాంగును పెండ్లాడక మునుపు ఆమెను గాఢంగా ప్రేమించాడు. చుట్టరికం గూడా వున్నవాడు. ఇప్పుడు బివర్లేకు ఆశ్రయమివ్వడము పొరపాటా అనుకున్నాడు. బివర్లే ఉన్న కష్ట స్థితినీ తల్లి లేని తన బిడ్డల స్థితినీ యోచించి ఆమెను కొన్నాళ్ళు అతిథిగా ఉండడాని కాహ్వానించాడు.

ఉండగా ఉండగా బివర్లేను చూడగా చూడగా జాను హృదయంలో సంచలనం కలగడ మారంభించింది. ఆమె ముఖంమీద ఏదో తీరని విచార మున్నట్లాతని కగుపించి జాలిపడేవాడు.

వాకిట చేరగానే బివర్లే "నాకోసం చూస్తున్నావా జాన్ ?" అని అడిగింది.

"అవును బివర్లే! వంట ఎదురు చూస్తోంది! వేగిరం డిన్నర్ కానిద్దాం పద !" అన్నాడు జాన్.

భోజన సమయంలో చకచకా సంతోషంగా మాటాడుతూనే వున్నది బివర్లే. కాని అంతర హృదయంలో యేదో ఆక్రోశం వున్నదని జాన్‌కు మాత్రమే తెలుసు— ఏమిటో అది.

బివర్లేని గురించి అన్ని విషయాలూ జానుకు తెలియవు. ఇటీవ లామెకేమేమి క్రొత్త దుఃఖాలు ఆవహించాయో ఆమెనడిగి ఊరడిద్దామని వుంటుంది జానుకు. కాని ఆమె సున్నితమైన మనస్సుకు నొప్పి కలుగు తుందేమోనని ఊరుకున్నాడు.

"మీ చర్చిలో ఇవ్వాళ ఛోయిర్ ప్రాక్టీసుకు ఎంతమంది వచ్చారు జాన్?" అన్నది బివర్లే.

"అంతా వచ్చారు. నిజంగా సంతోషం వేసింది. ఆదివారం నాడు నీవు సోలో తీసుకుని పాడతావేమో అడగమన్నారు వాళ్ళంతా !"

బివర్లే బుగ్గలు ఎర్రబారేయి.

"నేనింకా సరిగా పాడడం ఆరంభించలేదు జాన్ !"

"వాళ్ళెంతో సంతోషిస్తారు. వెనకటి దినాలలో నీవు సొప్రానో సోలో పాడుతుంటే విని ఆనందించిన వాళ్ళే. తప్పకుండా నా మాట విని పాడు, బివర్లే! రేపటి పాట నాకు నచ్చిందికూడా.... జ్ఞాపకం లేదూ!"

వొంకమైన పావురాల రెక్కలివ్వవో!
అంకపాళి, దీనురాల, నెక్కనివ్వవో"

బివర్లేకు కండ్ల వెంబడి చుక్కలు రాలాయి. ముఖం వంచుకుని "నేను పాడలేను జాన్!" అన్నది.

"చూడు బివర్లే! నీకిష్టం లేకపోతే నీవు చెప్పవద్దుగాని అసలు నీ దుఃఖ కారణం అంతా పూర్తిగా నాకు చెప్పగూడదూ? అంతా నాకు తెలిస్తే ఏం చేయాలో నేనైనా ఆలోచిస్తానుగా!"

"నీకు తెలుసుగా జాన్. నా భర్త డోనాల్డు పిచ్చాసుపత్రిలో వున్నాడుగా!"

"అవును. పిచ్చాసుపత్రిలో పెట్టారని తెలుసు. అంతే. ఎందుకో, ఏమిటో, ఎట్లా వున్నాడో అదంతా ఏమీ తెలియదు, నీవు చెప్పలేదు."

"లాభంలేదు జాన్! డోనాల్డు పిచ్చి కుదిరేది కాదు. పోయిన తడవ నేను చూసినప్పుడు పిచ్చి ఎక్కువే కాకుంటా జబ్బులో కూడా వున్నాడు."

"అయితే బ్రతికివున్నంతకాలమూ చచ్చినవారితో సమానంగా వుండడమేనా మీ ఇద్దరూ!"

"అంతే!"

"పోనీ విడాకులు తీసుకోవచ్చునుగా! శాస్త్రంలో చెప్పని పరువు మానసికంగా పోతుందా?"

"కష్టమే, సరేగానీ, జాన్! దొడ్లో బావిని పూడ్పించవూ?"

"పనివాండ్లతో చెప్పితినే! పూర్తి చేయలే!"

"లేదింకా జాన్! అదేమిటో ఆ బావి అంటే నాకు భయంగా వుంది. ఇంట్లో ట్యాప్ ఉందిగా!"

"బావి అంటే భయమెందుకు పిచ్చిదానా! పిల్లలను అటు పోనివ్వకుండా చూస్తూంటే చాలు."

"పిల్లలనటు అసలే పోనివ్వడంలేదు. కాని ఆ బావిని చూసినప్పటి నుంచి ఇక్కడేదో జరుగుతుందని నా గుండె గుబులు గుబులుగా వున్నది జాన్. పిచ్చినమ్మకమను. ఏమైనా అను.

"పిచ్చి నమ్మకమే మరి! మనందరికీ తెలుసు, ఆ బావి నేలమట్టపుదని. నాలుగో వేపున గోడ లేకపోయినా చుట్టుప్రక్కల వాళ్ళకు గూడా తెలుసు. ఇంకేం భయం!"

ఎవరేమనుకున్నా నిన్నవచ్చి పని ఆరంభించిన వాళ్ళ మేస్త్రీ వద్దకు మర్నాడు వెళ్ళింది బివర్లే. ఆనాడు పనివాళ్ళకు సెలవనీ అటూ యిటూ పోయారనీ విని వ్యధపడ్డది.

ఆ సాయంత్రం ఇంట్లో వంటకత్తెకు కూడా సెలవే. జాన్‌కు ఒక సభకెళ్ళవలసిన పని వచ్చింది. "సాధ్యమైనంత త్వరలో వస్తాలే" అన్నాడు.

"ఫరవాలేదులే. ఏమి తోచకపోతే నా పుస్తక మున్నదిగా" అన్నది బివర్లే. కాని జాను వెళ్ళిన కాసేపటికే గుండెలో ఏదో అదురుసాగింది. పిల్లలకు ఆనాడు ఒకటి కాదు రెండు కథలు చెప్పి వాళ్ళ దగ్గిరే కూర్చున్నది. ఒంటరిగా ఉండడానికి హడిలి పోతున్నది. అయినా పిల్లలను ఎంతసేపు మేలుకునేట్లు చేస్తుంది. వాళ్ళు నిద్రపోయారు.

ఏమీ తోచక బివర్లే దీపం దగ్గరకుపోయి మధ్యాహ్నం తన కొచ్చిన వుత్తరం తీసి చదువుకున్నది. "నిజమా? తప్పించుకుపోయావా? వస్తావా?" అని అనుకున్నది.

హఠాత్తుగా బివర్లేకు అడుగుల చప్పుడు వినబడ్డది. గుర్తించింది. అవి డోనాల్డు అడుగులే. దగ్గిరికొస్తున్నాయి, దగ్గిరికొస్తున్నాయి.

అదుగో! డోనాల్డు ముఖం! ఆ కళ్ళల్లోని పిచ్చిజ్వాల చూడెంత భయంకరంగా వున్నదో. ఆ పెదిమలు! చిరు అదురుతో చిన్నప్పుడు తనతో ప్రేమకలాపాలాడి తనను పెండ్లాడినవి. ఈ పెదవులు అట్లే చిరు అదురుతో ఏమో మాటాడుతున్నాయే! కాని ఏమి కళ్ళు!

అడుగో కిటికీలోంచి చూస్తున్నాడు డోనాల్డు. తలుపును నెట్టాడు. తలుపు రాలే. వెనక్కిపోయాడు. వెళ్ళిపోయాడు. అడుగుల చప్పుడు పోయింది....అయితే, ఈ ఎడ్రెసెట్లా తెలుసూ! తన దుఃఖ పరిస్థితి నెరిగి జాన్ తన బిడ్డలకు గవర్నెసుగా రమ్మన్నపుడు తన ఎడ్రెసెవరికీ చెప్ప లేదే....పిచ్చి డోనాల్డు, పట్టు వదలడు. మొండిపట్టు. వచ్చి లాక్కెళ్ళ తాడు. వెళ్ళక ఏం చేయగలుగూ....విధిని ఎట్లా దాటగలుగూ....అను కుంటూ తన నిరాధార స్థితినీ నిర్భాగ్యతనూ తలిచి తలిచి వాపోయి వాపోయి అట్లే సోఫాపై చేరగిలింది.

ఈ స్థితిలో తిరిగి వచ్చిన జాను, బివర్లేను చూచాడు. అతడి గుండె కలుక్కుమన్నది. బివర్లేను మృదులంగా లేపాడు. భయ కారణ మడిగాడు. అడుగుల చప్పుడును గురించి ఆమె చెప్పినపుడు, 'తోటమాలి ఇంటి కెళ్ళ లేదా' అని అడిగాడు. తోటమాలి కాదని తెలిసినపుడు, "నీ మనస్సిప్పు డున్న స్థితిలో నీకీ గాభరా ఆలోచన లొస్తున్నాయి బివర్లే. పోయి పడుకో రాదూ!" అన్నాడు. "ఇప్పుడే నేను ఇంటిచుట్టూ, తోటచుట్టూ చూస్తానులే. పోయిం పడుకో!"

"జాగ్రత్త జాన్! తోటచూట్టూ పోయేప్పుడా బావి జాగ్రత్త!"

"బావీ గీవీ! నీ మొఖం! బావి అంటే నీకో దయ్యంగా వున్నది. రేపే పూడ్పిస్తాను. ఫరవాలేదులే, పడుకో. తోట చుట్టూ చూసి నే నెక్కడా

బావిలో పడలేదని నీకు గుర్తుగా నీ గది తలుపుమీద తట్టి నా గదికి పోతానులే. సరేనా!"

తన గదికిపోయి పడుకున్నది బివర్లే. అరగంట సేపటికి తలుపుమీద తట్టినట్టు వినపడ్డది. అమ్మయ్య, జాను వచ్చేశాడు అనుకుంది.

రాత్రి వొంటిగంట అయింది. నిద్రలో కలవరిస్తూ మేలుకున్నది బివర్లే, అటూ యిటూ చూసింది. ఏదో విపరీతమైన కేక వినబడ్డది. పడవ మునుగుతుంటే పడవలోని ప్రాణి కేక వేసినట్టుగా వుంది. ఏదో సహాయం కోరుతున్నట్టుగా ఆ కేక కర్థం స్ఫురించింది. వెళ్ళి జానును నిద్రలేపి 'నీకేదైనా కేక వినబడ్డదా' అని అడిగింది. 'ఏమీలేదు పిచ్చిదానా, ఎందుకు మతి భ్రమ పడతావు పడుకో' అని నిద్రకళ్ళతో జాన్ అంటూ పడుకున్నాడు. మళ్ళీ తన గదిక్కి వచ్చేసింది. కూర్చున్నది,

ఆ కేక డోనాల్డుదేమో? ఈ మాట అనుకోగానే బివర్లేకు డోనాల్డు మీద ప్రథమాన కలిగిన ప్రేమ మళ్ళీ వచ్చి హృదయ మాక్రమించింది. డోనాల్డు వచ్చి వచ్చి ఆ బావిలో పడతాడేమో! తప్పించాలి, తప్పించాలి అనుకుని ఆమె మెల్లిగా తలుపుతీసి తోటలోకి పోయింది.

మళ్ళీ ఈ విపరీతపు కేక వినబడ్డది. బివర్లే ఒళ్లు ఝల్లుమన్నది. పోతూ పోతూ నిలబడ్డది. నిలబడ్డ బివర్లేను చెట్టుచాటునుండి ఎవరో రెండు చేతుల కౌగిలి పట్టులోనూ బిగించేశారు.

ఎవరో కాదు డోనాల్డే!

విపరీతమైన వెర్రికేకవేసి స్పృహ తప్పిపోయింది బివర్లే,

ఒకసారి నిద్రాభంగమైనాక మళ్ళీ సరిగా నిద్రపట్టలేదు జానుకు. రెండో కేక వినగానే నిద్ర బాగా పటాపంచలయింది. ఏమిటా అని వాకిటకు రాగానే మూడో కేక వినబడ్డది. ఈ కేక అబద్ధం కాదు, అది జంతువు కేక కాదు. జంతువుకు చిక్కిన మానుష కేక!

వెంటనే పరుగెత్తాడు జాను. తోటలోకి రాగానే చెట్లసందున బివర్లేని ఉడుము పట్టుకున్నట్లుగా పట్టుకున్న డోనాల్డును చూచాడు. పట్టు విడిపించ డానికి మీదపడ్డాడు.

అనుకోకుండా ఎవరో మీదపడేసరికి డోనాల్డు బివర్లేను చటిక్కున వదలి చేతకాని కోపంతో రోషంతో భయంతో ఆవేశంతో పిచ్చితో పరు గెత్తుకు పోయాడు.

స్పృహ తప్పిన బివర్లేను జాన్ లేవనెత్తుతుండగా దెబ్బతగిలి పడ్డ వానికేకల్లే మళ్ళీ ఓ కేక వినబడ్డది.

బివర్లేకు స్పృహ తెలిసి ప్రక్కనున్నది జానని తెలుసుకొని "చూడు చూడు జాన్! డోనాల్డ్ బావిలో పడకుండా చూడు. పద!" అన్నది.

అంతరంగికంగా జాను మనస్సుకు ఆ కేక వేసింది బావిలో పడుతూ డోనాల్డే అని అనుమానం వేసిందిగాని పైకి అనలేదు.

అతని అనుమానం వెతికిన తర్వాత నిజమేనని తేలింది. మనుష్యులు వచ్చి చూచేసరికి తలపగిలి బావి అడుగు నున్నాడు డోనాల్డు. ముఖంమీద మాత్రం పిచ్చెత్తక మునుపున్న కళ మళ్ళీ గోచరించింది.

"శరీరంతో బావిలో పడితేనేగాని అతని కల్లోలాత్మకు విడుదల రాలేదు పాపం!" అనుకున్నాడు జాన్.

బివర్లే కల్లోలాత్మకూ అనేక దినాలదాకా విడుదల రాలేదు. ఈ అల జడి అంతటికీ ఫలితంగా ఆమె మంచమెక్కింది. మూడు మాసాలు మృత్యు వుతో చెలగాటలాడింది. జాను ఉన్నాడు గనక, జాన్ ఉపచర్య చేశాడు గనక తుదకు బ్రతికింది. తుదకు శాంతి పొందింది. తుట్టతుదకు బివర్లే జానును పెండ్లాడి శాంతితోబాటు సౌఖ్యమూ పొందింది.